క్లుప్తంగా

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శోభన్‌బాబు

పొదిలి రూరల్: గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి సాధించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీఓ జి.శోభన్ బాబు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


వనరుల సద్వినియోగంతో అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ, పక్కన ట్రైనర్ కిషోర్

కొనకనమిట్ల: వనరుల సద్వినియోగంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా మండల స్థాయిలో పని చేసే ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, అధికారులకు ఇచ్చిన శిక్షణలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికల గురించి చర్చించారు. సచివాలయ ఉద్యోగులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధికి సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీదేవి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెగుళ్ల దాడి.. వచ్చేనా దిగుబడి?

- పశ్చిమ ప్రకాశంలో పంటలను చుట్టుముట్టిన తెగుళ్లు
- మిరపలో, శనగ పైర్లను ఆశించిన పొగాకు లద్దె పురుగు
- మొక్కజొన్నలో మొవ్వలు తొలిచేస్తున్న కత్తెర పురుగు
- కంది పంటను నాశనం చేస్తున్న మారుకా మచ్చల పురుగు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయని రైతుల ఆందోళన



మార్కాపురం:

పశ్చిమ ప్రకాశంలో పంటలపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పత్తి, మిర్చి, కంది, మొక్కజొన్న, పప్పు శనగ తదితర పంటలపై తెగుళ్ల దాడి ఉధృతంగా ఉండటంతో దిగుబడిపై రైతులు దిగులు చెందుతున్నారు. మార్కాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట, పెద్దారవీడు, దోర్నాల, త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లో ఇప్పటి వరకు మిర్చి సుమారు 42,886 ఎకరాల్లో, పత్తి 41,250 ఎకరాల్లో సాగైంది. వరి 10,917 ఎకరాలు, కంది 34,402.5 ఎకరాలు, ఆముదం 2062.5 ఎకరాలు, పెసర 252.5 ఎకరాలు, మినుము 935 ఎకరాల్లో సాగు చేశారు. ఇవి కాక సజ్జ, జొన్న, మొక్కజొన్న, శనగ పంటలను గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో వేశారు. గత రెండు నెలల క్రితం కురిసిన వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం అక్కడక్కడా ఉన్న పత్తికి గులాబి తెగులు సోకింది. మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి, నికరంపల్లి, కోలభీముని పాడు, భూపతి పల్లె, గజ్జలకొండ, తదితర గ్రామాల్లో తెగుళ్ల ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. పెద్దారవీడు మండలంలోని బద్వీడు చెర్లోపల్లి, దేవరాజుగట్టు, కొత్తపల్లి, సానికవరం, చట్లమిట్ల, కుంట, తంగిరాలపల్లి, యర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడు, బోయలపల్లి, తర్లుపాడు మండలంలోని తర్లుపాడు, సీతానాగులవరం, సూరేపల్లి, తాడివారిపల్లి, కలుజువ్వలపాడు తదితర గ్రామాల్లో మిర్చి, కంది పంటలు సాగులో ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా మిరపకు మచ్చ తెగులు సోకుతోంది.

కందిలో మారుకా మచ్చల పురుగు

కందిలో మారుకా మచ్చ తెగులు ఉధృతిని వ్యవసాయాధికారులు గుర్తించారు. ఇది కంది పెరిగే దశలో ఆకుచుట్టూ చేరి ఆకులను, పూతను చుట్టగా చుట్టుకుని లోపల ఉండి గీరి తింటోంది. దీంతోపాటు కాయ తొలుచు పురుగు కూడా చేరడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పురుగు కాయకు రంధ్రాలు చేసి గింజలు తింటూ ఒక కాయ నుంచి మరో కాయకు ఆశిస్తుంది. పప్పు శనగను రబ్బరు పురుగు, మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

మిర్చిలో లద్దెపురుగు

మిర్చి పంటను పొగాకు లద్దెపురుగు దాడి చేస్తోంది. త్రిప్స్(పైముడత) కూడా సోకింది. పొగాకు లద్దెపురుగును రైతులు కాయతొలుచు పురుగు, శనగపచ్చ పురుగు అని కూడా పిలుస్తారు. ఈ పురుగులు ముందు ఆకులను నష్టపరిచి తరువాత కాయల్లో చేరి గింజలను తినేస్తున్నాయి. త్రిప్స్ పురుగులు మొక్కను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఆకుల అంచులు ముడుచుకుపోతున్నాయి. ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారి పూత పూయడం, కాయ కాయడం నిలిచిపోతోంది.

"తెగుళ్లతో భయంగా ఉంది


నేను నాలుగెకరాల్లో కంది సాగుచేశా. ఈ మధ్య వర్షాలకు కంది పూత కూడా బాగానే వచ్చింది. కానీ మారుకా మచ్చల పురుగు సోకడంతో పంట పోతోంది. పురుగు ఉధృతిని చూస్తుంటే ఎకరాకు 2 క్వింటాళ్ల వరకు దిగుబడి పోయేలా ఉంది. వ్యవసాయాధికారులు చెప్పిన పురుగు మందులు వాడుతున్నా.
– జి.రామకృష్ణ, రైతు, గజ్జలకొండ

"మిర్చికి ఎంత నష్టమొస్తుందో..


ఈ ఏడాది మిర్చి పంటలో తెగుళ్లు వచ్చాయి. పొగాకు లద్దె పురుగు, వైరస్ తెగులు సోకింది. ఎకరాకు రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టి మిర్చి నాటా. ఇప్పుడిప్పుడే దిగుబడి వస్తోంది. ఈ పరిస్థితుల్లో తెగుళ్లు ఎంతటి నష్టాన్ని కలిగిస్తాయో అర్థం కావడం లేదు. ఉద్యాన శాఖాధికారులు సూచించిన మందులు వాడుతున్నా.
– ఏరువ వెలుగొండారెడ్డి, రైతు, బడేఖాన్‌పేట

"మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మిర్చిలో పొగాకు లద్దె పురుగు ఉన్నట్లయితే వేపనూనెతో కలిపిన ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేసుకోవాలి. ఎక్కడైనా తెగుళ్లు వస్తే వెంటనే సమీపంలో ఉన్న వ్యవసాయ సిబ్బందికి లేదా మా దృష్టికి తెస్తే నివారణ పద్ధతులు తెలియజేస్తాం. వైరస్ తెగులు సోకితే పిప్రోనిల్ 400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. విచ్చలవిడిగా పురుగుమందులు వాడవద్దు. త్రిప్స్(రెక్కల పురుగు) నివారణకు కార్బోరిల్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి ఆకు అడుగుభాగం తడిచేలా పిచికారీ చేయాలి. కాయకు మచ్చతెగులు సోకితే ఎకరాకు క్లోరిథరోనిల్ 250 గ్రాములు లేదా కాబ్రియోటాప్ 600 గ్రాములు ఎకరానికి స్ప్రే చేసుకోవాలి.
– బాలాజీ నాయక్, ఏడీఏ, మార్కాపురం

"కందిలో తెగుళ్ల ఉధృతి గమనించండి


కంది సాగు చేసిన రైతులు కాయ తొలుచు పురుగు విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఈ పురుగు పూత, పిందె దశలో కాయలకు రంధ్రాలు చేసి దిగుబడి రాకుండా రైతులను నష్టపరుస్తుంది. వేపనూనెతో కలిపి ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా ఫ్లూ బెండమైడ్ 50 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్కజొన్నలో కూడా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కత్తెర పురుగు అక్కడక్కడా ఆశించింది. దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు లేదా క్లోరాన్ ట్రినిపోల్ 60 ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.
– దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏఓ మార్కాపురం

మిరపలో జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ విజయభాస్కర్‌రెడ్డి


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: మిరప పంటలో రసం పీల్చు పురుగు నివారణకు ఫిప్రోనిల్ గుళికలు ఎకరాకు 8 కిలోలు చల్లుకోవాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత అన్నారు. బుధవారం మండలంలోని బార్లకుంట, చెన్నుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిగురు అట్టలు ఎకరానికి 15 పసుపు రంగు, 15 నీలం రంగువి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వేపనూనే ఒక ఎంఎల్ లీటర్ నీటికి ఇతర మందులతో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రైతులు పండించే శనగ పంటలో పచ్చపురుగును గుర్తించి వాటి నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాములపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కంది పంటలో మారుక మచ్చల పురుగు ఉధృతి ఉందన్నారు. రైతులు పండించే పంటలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు వ్యవసాయంలో మెళకువలు పాటిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి రైతు పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా శనగ పంటలను పరిశీలించారు. సూక్ష్మ నీటి యాజమాన్యం ఏరియా ఆఫీసర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయని, బోరు ఉన్న ప్రతి రైతు డ్రిప్పు, ఇరిగేషన్ ద్వారా నీటిని మొక్కలకు అందించాలన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.

జాగృతితోనే మోసాలు జయించగలం

- పౌర సరఫరాల డీటీ అర్జున్‌రెడ్డి


మాట్లాడుతున్న డీటీ అర్జున్‌రెడ్డి

మార్కాపురం టౌన్: వినియోగదారులుగా చట్టాలపై జాగృతి పొందడం ద్వారా మాత్రమే మోసాలను అధిగమించవచ్చని పౌర సరఫరాల విభాగం డీటీ కె.అర్జున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాధన డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల వారోత్సవ ప్రారంభ కార్యక్రమం ప్రిన్సిపాల్ కె.మధుసూదన్‌శాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ యువత, మహిళలు, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నపుడే మోసాలను గుర్తించి ఎదుర్కోగలమన్నారు. పది రూపాయలు మించిన ప్రతి వస్తువుకు వినియోగదారులు తగిన రశీదు పొందాలన్నారు. వైపాలెం డీటీ ఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ వస్తువులకు రశీదును కలిగి ఉంటే నాణ్యతపై భరోసా పొందవచ్చన్నారు. వాణిజ్య రంగంలో తరచూ జరిగే మోసాలను అప్రమత్తంగా ఉండేందుకు వినియోగదారులు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా వినియోగదారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఓఏ మల్లిక్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, నూనె డబ్బాలు తదితర వాటి విషయంలో జరిగే మోసాలను వివరించారు. యువతతో వినియోగదారుల చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ అధికారి మొహస్సిమ్, వినియోగదారుల సంరక్షణ చట్టాల ఫోరం జిల్లా బాధ్యులు ఓసీహెచ్ నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వై.స్వాతి, కళాశాల టీపీవో పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, మురళి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- హాజరైన మాజీ మంత్రి డాక్టర్ సురేష్


ప్రార్థనలో పాల్గొన్న మాజీ మంత్రి సురేష్ తదితరులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని మాట్లాడారు. ఏసుక్రీస్తు జననం ఒక చారిత్రక సత్యమని, మానవాళికి మోక్షమార్గం అందించేందుకు దివి నుంచి భువికి దిగివచ్చిన దేవకుమారుడని అన్నారు. యర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రి డాక్టర్ యధిద్యా క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఆర్‌సీఎం ఫాదర్ జాన్ ఆరోమ్, పి.ఆండ్రూస్, బాప్టిస్టు చర్చి ఫాస్టర్ జాన్ అబ్రహం, క్రీస్తు లూథరన్ చర్చి పాస్టర్ సి.రామస్వామి తదితరులు వాక్య సందేశమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైబిల్ క్విజ్, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, ప్రొఫెసర్ విజయబాబు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. క్రీస్తు జననంపై విద్యార్థుల నృత్య రూపకాలు ఆహూతులను అలరించాయి. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న అధికారులు

కొనకనమిట్ల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీఓ బుల్లెన్నరావ్ ఆధ్వర్యంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామసభల్లో తెయజేసిన పనులను పనులు చేపట్టాలని చెప్పారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓతోపాటు పాస్టర్ కిషోర్‌కుమార్, ఏపీఓ బుల్లెన్నరావు, క్లస్టర్ సూపర్‌వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెంచుగూడెం ఆకస్మిక తనిఖీ


చెంచుగూడెంలోని స్థానికులతో పీఓ కేవీ శివప్రసాద్

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట సమీపం చెంచుగూడేన్ని శ్రీశైలం ప్రాజెక్టు అధికారి కేవీ శివప్రసాద్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెంచుగూడెంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులు సంఖ్య, రిజిస్టర్లను పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలు మధ్యాహ్నం భోజనం అనంతరం సెంటర్‌లో లేకుండా పంపించడంపై అంగన్‌వాడీ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులను సెంటర్‌లోనే ఉంచాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు శుభ్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. ఈ సందర్భంగా గూడెంలో కొన్ని గృహాలు వర్షాలకు కారుతున్నాయని పీఓ శివప్రసాద్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. కొన్ని గృహాలు వర్షాలకు కారుతున్నాయని చెప్పారు. పట్టలను ఏర్పాటు చేసి గృహాలు కారకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. రెండేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడిన సుగాలి అనే వ్యక్తి తనకు పెన్షన్ రావడం లేదంటూ సమస్యను ఆయన దృష్టి తీసుకెళ్లారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ వికలాంగుల పెన్షన్ వచ్చేందుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చెంచుగూడెంలో పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెంచుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు, వాచ్‌మెన్లకు ఆరు నెలలగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులకు జూలై నుంచి వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. అతి తక్కువగా రూ.6 వేలు ఇస్తూ.. అది కూడా ఆరు నెలలుగా నిలిపేయడాన్ని తప్పుబట్టారు. వారు కుటుంబాలను పోషించుకోవడం కోసం అప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టాన్ని కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, ఏడాదికి రెండు జతల యూనిఫాం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్, నాయకులు నాగరాజు, లక్ష్మి, చంద్రకళ, మహాలక్ష్మి, కళావతి, రామలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గమ్మ విళక్కి మహోత్సవం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణం 10వ వార్డులోని విజయటాకీస్ సమీపంలో నాగేంద్ర కనక దుర్గ అమ్మవారి దేవస్థానంలో భవానీ స్వాముల ఆధ్వర్యంలో విళక్కి మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు కలశ స్థాపన, 9.30 గంటలకు అభిషేకాలు, పడిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం పులి వాహనంపై అమ్మవారి నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సకల మాలధారణ స్వాములు, భక్తులు, మహిళా మండలి సభ్యులు, యువజన కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పట్ల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: బహుజన పరిరక్షణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్సై బి.నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై దుప్పట్లు, చీరలు కార్మికులకు అందజేశారు. అంబేడ్కర్ వర్ధంతి, క్రిస్మస్ పండగను పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు దాసరి యేబు తెలిపారు. అల్లూరయ్య, రమేష్, సుబ్రహ్మణ్యం, డిష్ మున్నా, దాదా పాల్గొన్నారు.

మహా సంప్రోక్షణ పూజలు

బేస్తవారిపేట: స్థానిక తేరు బజార్‌లోని పట్టాభిరామస్వామి ఆలయ మహా సంప్రోక్షణ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో విశేష అర్చనలు, ఉదక శాంతి, మూలమంత్ర హోమాలు, శాంతి పౌష్టిక హోమాలు, పూర్ణాహుతి, ఆలయ సంప్రోక్షణ, శిఖర కలశాభిషేకం, జీవకళాన్యాసం, కళారోపణం, శాంతి కళ్యాణ పూజలు జరిపించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు.

గ్రామ రెవెన్యూ సభలో పది అర్జీలు


మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు రూరల్: మండలంలోని సంజీవరాయుడుపేటలో స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో స్థానిక ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందించారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పేరు మార్పులు వంటి సమస్యల మొత్తం పది అర్జీలు వచ్చాయి. ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారం కోసం కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ సభలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, వారి సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు. జెడ్పీటీసీ బుడత మధుసూదన్‌రావు, ఆర్‌ఐ భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, వీపీ రమణ పాల్గొన్నారు.

కంభం: మండలంలోని లింగాపురం, లింగాపురం కండ్రిగ రెవెన్యూ పరిధిలో బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో 8 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.కిరణ్ తెలిపారు. వచ్చిన అర్జీలు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ పొలాల సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


లింగాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

యర్రబాలెం విద్యార్థినులకు సత్కారం


విద్యార్థినులను సత్కరిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు

కంభం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జానపద నృత్యం పోటీల్లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. మండలంలోని యర్రబాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు పిక్కిలి పావని, పిక్కిలి లక్ష్మి, నల్లబోతుల కామేశ్వరి, నల్లబోతుల మాధవి, ఈర్ల శివపార్వతిలు రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫోక్ డ్యాన్స్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం సాయంత్రం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెమొంటోలు, వెండి కాయిన్స్, ఇతర బహుమతులు అందజేసి శాలువాలతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఏరువ లక్ష్మయ్య, సర్పంచ్ మద్దు శ్రీనివాస్, ఎంపీపీ భర్త చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ జమ్ములదిన్నె లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎస్పీ ప్రశంస


ప్రశంస పత్రం అందుకుంటున్న సీఐ సుబ్బారావు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన

మార్కాపురం/పొదిలి: చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలెంలో 2020 ఫిబ్రవరి 22న ఎం.లక్ష్మి అనే మహిళ హత్యకేసులో నిందితుడు యాకోబుకు యావజ్జీవ శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి ఒంగోలు రూరల్ సీఐ, ప్రస్తుత మార్కాపురం పట్టణ సీఐ పి.సుబ్బారావును ఎస్పీ దామోదర్ అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందించారు. పొదిలి సర్కిల్ పరిధిలో సకాలంలో కేసులు ఛేదించేందుకు కృషి చేసిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమనకు ప్రశంస పత్రాలు దక్కాయి.

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు


అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఇలా..

కంభం: మండలంలోని లింగోజీపల్లి అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు అధ్వానంగా ఉండటంతో కేంద్రానికి వచ్చే చిన్నపిల్లలు, గర్భిణులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం ముందు చెత్తా చెదారం పడేస్తుండటం, గ్రామస్తులు వ్యర్థాలు సైతం కేంద్రం పక్కన ఉన్న కాలువలో వేస్తుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద అధికంగా ఉందని చెబుతున్నారు. చుట్టుపక్కల చిల్ల చెట్లు పెరిగిపోగా వాటి మధ్యలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. వర్షాలు పడ్డప్పుడు పరిసరాలు మరింత అధ్వానంగా మారిపోతున్నాయని కేంద్రం వద్దకు వచ్చే వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.